## క్లుప్తంగా...

### ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వానికి ఆరోగ్య సేవలో అనేక అవార్డులు, రివార్డులు తీసుకువచ్చేందుకు గ్రౌండ్ లెవెల్‌లో సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంల సర్వీసుల్ని బేషరత్తుగా క్రమబద్ధీకరించి వారికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఏఎన్‌ఎంల అందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం నోటితో పొగిడి నొసలుతో వెక్కిరించిన చందంగా వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. ఏఎన్‌ఎంలు విధులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం అన్నారు. ఏఎన్‌ఎంల సంఘం ప్రతినిధులు తిరుపతమ్మ, గుణవతి, లలిత, శోభ నాగమణి పాల్గొన్నారు.

### కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ


కార్మికులకు సరుకులు అందజేస్తున్న తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

మేడ్చల్: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలుపుతూ వారు ఇబ్బందులు పడకుండా తీన్మార్ మల్లన్న టీం సభ్యులు మేడ్చల్‌లో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మె చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించి వారికి బియ్యం, పప్పు, ఉప్పు, నూనెలను అందజేశారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు మండల సంజీవ, గణేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, గూడరు సబితాఆంజనేయులుగౌడ్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, దివ్యదయాకర్‌రావు, సుమిత్రసురేష్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎల్లంపేట్‌లో బొడ్రాయి వేడుకలు



మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠించనున్న బొడ్రాయికి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి గంగాజలం తీసుకెళ్లి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్, ఉపసర్పంచ్ గోప గణేశ్, మాజీ సర్పంచులు రేణుక, లింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆర్మీ వాహనాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు మృతి

శామీర్‌పేట్: ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన ఘటన శుక్రవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామానికి చెందిన పిట్టల గణేష్(24), కొంపల్లిలోని అశోక్ లీల్యాండ్ షోరూంలో మెకానిక్. విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో దొంగల మైసమ్మ చౌరస్తా ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న ఆర్మీ వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.3 లక్షలు..

# గంపెడాశలు..

## గృహలక్ష్మి దరఖాస్తుల వడబోత షురూ..

- అన్ని ప్రాంతాల్లో పరిశీలిస్తున్న బృందాలు
- స్వీకరించిన దరఖాస్తుల సంఖ్య 11,048
- రేపటి వరకు పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి..
- అర్హుల జాబితాపై యంత్రాంగానికి నివేదిక
- జోరుగా రెండో విడత దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, మేడ్చల్ జిల్లా:ఇంటి స్థలం ఉన్న పేదలు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11,048 దరఖాస్తులు వచ్చాయి. చాలా మంది నిరుపేదలు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు గంపెడాశతో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 10 వరకు మొదటి విడతగా స్వీకరించిన దరఖాస్తుల గడువు ముగిసిపోవడంతో వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. బృందాల వారీగా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులను పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 20 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు.

**మొదటి విడతలో మూడు వేల ఇళ్ల చొప్పున..**

ప్రభుత్వం మొదటి విడతలో నియోజకవర్గానికి మూడు వేల ఇళ్ల చొప్పున మంజూరు చేయాలని నిర్ణయించింది. జిల్లాకు 15 వేల ఇళ్లను కేటాయించింది. వీటికి గాను 11,048 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గృహలక్ష్మి పథకం ఎవరిని వరిస్తుందోనన్న ఆందోళన పేదల్లో నెలకొంది. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.3 లక్షలను చెల్లించనుంది. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు మూడు విడతల్లో డబ్బులు చెల్లించనుంది.

**కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ..**

గృహలక్ష్మి పథకానికి సంబంధించి మొదటి విడతలో ఈ నెల 6 నుంచి 10 వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ఆగమేఘాల మీద దరఖాస్తును సమర్పించేందుకు పేదలు ప్రభుత్వ కార్యాలయాలకు పరుగు తీశారు. ఇందుకోసం తహసీల్దార్, పురపాలికలు, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ప్రత్యేక దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తులు చేసుకునే సమయంలో ధ్రువపత్రాలు 'అవసరం లేదని అధికారులు చెప్పడంతో ఆధార్, రేషన్ కార్డుల ఆధారంగా దరఖాస్తులు పెట్టుకున్నారు.

**వచ్చే నెల మొదటి వారంలో..**

గృహలక్ష్మి నిబంధనల ప్రకారం.. దరఖాస్తుదారులకు ఎలాంటి వివాదాలు లేని సొంత ఇంటి స్థలం ఉండాలి. పక్కా ఇల్లు ఉండరాదు. ఆహార భద్రత కార్డు తప్పని సరి. ఇతర ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొంది ఉండకూడదు. వీటికి అనుగుణంగా పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 20 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేసి నివేదికను తయారు చేయనున్నారు. అనంతరం మొదటి విడత అర్హుల జాబితాను ప్రభుత్వం ప్రకటించనుంది. వచ్చే నెల మొదటి వారంలో పథకం తొలి విడత నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మంత్రి, ఎమ్మెల్యేల ఆమోదం తర్వాత లబ్ధిదారుల జాబితాను ఈ నెలాఖరులోగా ప్రకటించే అవకాశాలున్నాయి. అధికార పార్టీ నేతలను కలిసి జాబితాలో చోటు దక్కించుకోవాలని చాలా మంది పేదలు తంటాలు పడుతున్నారు.

**పరిశీలన మొదలు కావడంతో..**

దరఖాస్తుల పరిశీలన పక్రియ మొదలు కావడంతో గృహలక్ష్మి వరిస్తుందో లేదోనసే ఆందోళన పేదల్లో నెలకొంది. మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే అధికారులు పరిశీలిస్తున్నారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఉద్యోగ బృందాలు పురపాలికల సంఘాలు, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వడబోత కార్యక్రమం చేపడుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ సేవలు మరవలేనివి


అంబేడ్కర్‌నగర్‌లో మేయర్ మేకల కావ్య తదితరులు


ఘట్‌కేసర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: భూస్వాముల నుంచి బహుజనులను కాపాడిన మహావీరుడు పాపన్నగౌడ్ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**మేడ్చల్ కలెక్టరేట్‌లో..**

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఘనత సర్వాయి పాపన్నకు దక్కుతుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటనర్సయ్య, అధికారులు రాజేశ్వర్, దేవేందర్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్‌నగర్‌లో..**

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

**చీర్యాల గ్రామంలో..**

కీసర: చీర్యాల గ్రామంలో నిర్వహించిన సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల్లో ఎంపీపీ ఇందిరాలక్ష్మీ నారాయణ పాల్గొని నివాళులర్పించారు. కరీంగూడ గ్రామంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ కలెక్టరేట్‌లో..


చీర్యాల గ్రామంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

## ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు అవసరం


అలియాబాద్‌లో గ్రంథాలయానికి భూమిపూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: ప్రతి గ్రామంలో గ్రంథాలయాల ఏర్పాటు ఎంతో అవసరమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయాంజాల్‌లో రూ.75 లక్షలు, శామీర్‌పేట్‌లో రూ.27 లక్షలు, అలియాబాద్ గ్రామంలో రూ.65 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న నూతన గ్రంథాలయాలకు జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దయాకర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఎంపీపీ ఎల్లుబాయి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అనిత, సర్పంచులు కుమార్‌యాదవ్, వైస్ చైర్మెన్ వాణివీరారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### నాగారంలో పర్యటించాలని వినతి



కీసర: పురపాలక పరిపాలన శాఖ సంచాలకులు పమేలా సత్పతిని శుక్రవారం నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నగరంలోని మున్సిపల్ పరిపాలన శాఖ కార్యాలయంలో కలిశారు. నాగారం మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వివరించారు. నాగారం మున్సిపల్‌ను సందర్శించాలని విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన పమేలా సత్పతి త్వరలో పర్యటించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, అన్నంరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ సెట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో


బహుమతులు అందజేస్తున్న చేస్తున్న సీఈఓ, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రకల్ప్ ప్రదర్శన్ పేరుతో నిర్వహించిన ఎక్స్‌పోను సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించగా సీఎంఆర్ గ్రూప్స్ కళాశాలలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 220 జట్లు నమోదు చేసుకోగా వారిలో 80 జట్లను ఎంపిక చేశారు. వారి వినూత్న ప్రదర్శనలను పరిశీలించి ఉత్తమంగా నిలిచిన మూడు ప్రదర్శనలకు సీఈఓ అభినవ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలి



ఘట్‌కేసర్: నేటి సమాజానికి నూతన ఆవిష్కరణలు అందించడానికి యువత ముందుకు రావాలని మైండ్స్ అండ్ డాట్స్ కన్సల్టింగ్ కంపెనీ ఫౌండర్, డైరెక్టర్ రామ్ జలదుర్గం అన్నారు. శుక్రవారం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ విభాగ జాతీయ సదస్సు 'ఇన్నోవేషన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మేనేజ్‌మెంట్ సైన్స్–2023 (ఐఈటీఎంఎస్)కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణలు సమాజానికి మేలు చేసేవిగా ఉండాలన్నారు. కళాశాల కార్యదర్శి సీవీ కృష్ణారెడ్డి, ఎంబీఏ ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి, పలు విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అర్హులకే ప్రభుత్వ పథకాలు

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ సూచనలు, సలహాలను అన్ని కార్యక్రమాలకు ఎప్పటికప్పుడు అమలు పరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కారుణ్య నియామకాలకు సంబంధించి 44 మందికి శనివారం వరకు ఉత్తర్వులు జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ సీఎస్‌కు తెలిపారు. శుక్రవారం కూకట్‌పల్లి నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో ఆయన మాట్లాడారు. ఆసరా పింఛన్లు, హరితహారం వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. జిల్లాలో 70 లక్షల మొక్కలు నాటేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేపడుతున్నామన్నారు. బీసీ, మైనారిటీలకు ఆర్థిక సాయం అర్హులైన వారికి వర్తింపచేసినట్లు తెలిపారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో వీఆర్‌ఏలను సర్దుబాటు చేసినందుకు కలెక్టర్ అమయ్‌కుమార్‌ను అభినందించారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో పురోగతి ఎంతో బాగుందని, అదే స్ఫూర్తితో మరింత ముందుకెళ్లాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్ అమయ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషి చేస్తున్నారని సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగలకు మరమ్మతులు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా 16 వార్డులో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం పునర్ నిర్మాణం కోసం అడ్డుగా ఉన్న తీగలకు మరమ్మతులు చేయించారు. అలాగే వంగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, విజయ్‌ముదిరాజ్, ఫయామ్, నిఖిల్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

పోచారం: అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమన్‌రెడ్డికి పోచారం మున్సిపల్ సిబ్బంది శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బిల్ కలెక్టర్లు రాజు, మధు, లక్ష్మి, శివ, వినయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రవీణ్, శివారెడ్డి, జవాన్లు అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 24గంటల పాటు అత్యవసర సేవలు అందించాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్

మేడ్చల్: మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు 24గంటలు అత్యవసర సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. వారం రోజులు.. 24గంటల పాటు ల్యాబ్, ఎమర్జెన్సీ ఆపరేషన్ సేవలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సిజేరియన్లను తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. సమావేశంలో ఆరోగ్య సేవల జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కోట్యానాయక్, సూపరింటెండెంట్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఆనంద్, ఆసుపత్రి వైద్యులు స్వర్ణలత, చంద్రకృష్ణ, సంగీత్, దీప్తి, సారాసిమాన్, దివ్య, పూజాఆనంద్, హర్షిని, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ ఇళ్లు ఇవ్వడంలో బీఆర్‌ఎస్ విఫలం


కీసర ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కీసర: పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కీసర ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేదలు సొంతింటి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని, వారికి వెంటనే ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో పేదలంతా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నేతలు విజయ్, అమర మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, ఏనుగు రాజిరెడ్డి, విజయలక్ష్మి, హైమారెడ్డి, పవన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, కోల బాల్‌రాజ్, బాపిరెడ్డి, నాగమల్లారెడ్డి, చినింగని సుధాకర్, రాగుల అశోక్, మెట్టు మహేందర్, కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ 'మైనార్టీ'బంధు

- తొలి విడతలో 514 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం
- నేడు కలెక్టరేట్లో 497 మందికి మంత్రి చేతులమీదుగా పంపిణీ
- ఈ నెలాఖరు వరకు 617 మందికి మైనార్టీ బంధు పథకం
- ప్రజాప్రతినిధుల సిఫారకు పెద్దపీట వేస్తున్నారని ప్రచారం
- ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులు 11 వేలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల వేళ ప్రభుత్వం దళిత బంధు, బీసీ కుల, చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం (బీసీ బంధు) మాదిరిగానే మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం(మైనార్టీ బంధు) పథకానికి శ్రీకారం చుట్టింది. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నప్పటికీ, దాదాపు మూడు నెలల వ్యవధిలో జరగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడాన్ని రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి శ్రీకారం చుట్టారని చర్చ సాగుతోంది. మైనార్టీ బంధు పథకం జిల్లా కలెక్టర్ కనుసన్నల్లో జరగాలని మార్గదర్శకాలను రూపొందించినా, అర్హుల ఎంపిక, జాబితా తయారీలో ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**తొలి విడతలో 514 మందికి..**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మైనార్టీ ఆర్థిక సాయం (మైనార్టీ బంధు) కోసం మొత్తంగా 11 వేల దరఖాస్తులు రాగా, తొలి విడతలో 514 మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా 497 మంది మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం కింద చెక్కులను పంపిణీ చేసేందుకు జిల్లా మైనార్టీ శాఖ సిద్ధమవుతోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఖాసీం పేర్కొన్నారు. మిగతా 17 మందికి ఒకటి, రెండు రోజుల్లో మైనార్టీ బంధు పథకం కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అలాగే, ఈ నెలాఖరు వరకు మరో 600 మందికి మైనార్టీ బంధు పథకంలో భాగంగా రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేస్తామని తెలిపారు. 600 మంది అర్హుల ఎంపికలో భాగంగా జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 120 మంది చొప్పున 5 నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు మేరకు జాబితా ఖరారు కానున్నట్లు తెలుస్తోంది.

**మార్గదర్శకాల ప్రకారమే..**

ప్రభుత్వ మార్గదర్శకాలకు ప్రకారం మైనార్టీ బంధు పథకం కింద రూ.లక్ష ఆర్థిక సాయం అర్హులైన వారికి పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తిస్తామని పేర్కొంటున్నారు.

**సిఫార్సు చేసిన వారికే..**

మైనార్టీ బంధు పథకం కింద లబ్ధిదారుల ఎంపిక జాబితాపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిఫార్సు చేసిన వారికే రూ.లక్ష ఆర్థిక సాయం అందనున్నట్లు ప్రచారం సాగుతోంది. వేలాది దరఖాస్తుల్లో అర్హులను గుర్తించడానికి అధికారులు తీవ్రంగా శ్రమించినా జాబితా రూపకల్పనలో అధికార పార్టీ నేతల ప్రమేయం ఉన్నట్లు స్పష్టమవుతోంది.